సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం । 5 ఏప్రిల్ । 2024



ప్రపంచ పటంలో బౌద్ధక్షేత్రం
ఫణిగిరి బౌద్ధ క్షేత్రంపై లభించిన నాణేలు, శిల్పాలతో ప్రపంచ పటంలో నిలిచిందని పురావస్తు అధికారులు పేర్కొన్నారు. - 8లో



అన్నదాతకు 'సహకారం'
రాజాపేట మండల రైతులకు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) సేవలు మరింత చేరువ కానున్నాయి. - 9లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-35 (శుక్రవారం సా॥)
సహర్ 4-44 (శనివారం ఉ॥)

న్యూస్‌రీల్

నేడు కేంద్ర బృందం రాక

భూదాన్‌పోచంపల్లి : కేంద్ర అధికారుల బృందం శుక్రవారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించ నున్నట్లు పోచంపల్లి చేనేత టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు చేనేత కళాకారులు, వ్యాపారుల స్థితిగతులు, చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ అదనపు సెక్రటరీ, ఫైనాన్స్‌అడ్వైజరీ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్ అర్షిత్ గోపాల్, వీవర్ సర్వీస్‌సెంటర్ రీజినల్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ రానున్నట్లు వెల్లడించారు.

తాగునీటి సమస్య రావొద్దు

నల్లగొండ : వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చూడాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్ పేర్కొన్నారు. గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ, మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీఓలతో ఆమె సమీక్షించారు. వేసవిలో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్యలు లేకుండా చూడాన్నారు.

ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

సాక్షి, యాదాద్రి : కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని ఏరోజుకారోజు మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రవాణా కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం రవాణా చేయడానికి సరిపడా లారీలను సమకూర్చుకోవాలని, ఎలాంటి అంతరాయం ఏర్పడినా ఉపేక్షించేది లేదన్నారు. అదే విధంగా కొనుగోలు కేంద్రాలకు సరిపడా గోనె సంచులను ముందస్తుగానే చేరవేయాలని అధికారులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని, మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు, శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి సేవలను ప్రధానాలయ మాఢవీధిలో ఊరేగించారు.సువర్ణపుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారులు కీలకం



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు

గుండాల : ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకం అని, అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు పెసర లింగారెడ్డి పేర్కొన్నారు. గురువారం గుండాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపీఓలకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. విధులపై అవగాహన పెంచుకొని విజయవంతంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జలకుమారి, మాస్టర్ ట్రైనర్లు సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, ఎంఆర్‌ఐలు పాల్గొన్నారు.



సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాంలో ఎండిన పొలంలో పశువులను మేపుతున్న రైతు



సంస్థాన్‌నారాయణపురంలో నెర్రెలుబారిన పొలం

భగీరథ ప్రయత్నం

- పంటలను కాపాడుకోవడానికి అన్నదాతల తంటాలు
- కిలో మీటర్ల మేర పైపులైన్లు వేసి, ట్యాంకర్ల ద్వారా తడులు
- నాన్ ఆయకట్టులో కొత్త బోర్ల తవ్వకం
- జిల్లాలో 2.93 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 30 శాతానికి పైగా ఎండిన పొలాలు





అత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేటకు చెందిన ఆవుల మల్లయ్య ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాడు. మొన్నటి వరకు పొలం బాగానే పారింది. ఒక్కసారిగా భూగర్భ జలాలు పడిపోవడంతో బావి అడుగంటింది. పూడిక తీయించినా నీటి ఊట అంతంతమాత్రంగానే ఉంది. పంటను కాపాడుకునేందుకు 500, 300, 200 ఫీట్లకు ఒకటి చొప్పున మూడు బోర్లు వేయించినా చుక్క నీరు పడలేదు. బావిలో ఉన్న కొద్దిపాటి నీటిని సద్వినియోగం చేసుకోవాలనుకున్నాడు. కరెంట్ సరిగా రాకపోవడంతో జనరేటర్ ఏర్పాటు చేశాడు. ఎండే దశలో ఉన్న పొలాన్ని కొద్దోగొప్పో కాపాడుకోగలిగాడు. మిగతా పంట పూర్తిగా ఎండిపోయింది. 250 బస్తాల వడ్లు వస్తాయనుకుంటే 150 బస్తాల దిగుబడి వచ్చిందని, మద్దతు ధరకు విక్రయించినా రూ.1.20 లక్షలకు మించి రావడం లేదని రైతు వాపోయాడు.

సాక్షి, యాదాద్రి : బోర్లు, బావుల్లో నీటి ఊటలు అడుగంటిపోయాయి. నీరందక చేతికొచ్చిన పంట కళ్లెదుటే ఎండిపోతుంటే కాపాడుకునేందుకు అన్నదాత భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. చివరి ప్రయత్నంగా పైపులైన్‌లు వేసి, ట్యాంకర్ల ద్వారా తడులు అందిస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ఐదారేళ్లలో ఎన్నడూ లేని విధంగా భూగర్భ జలాలు పడిపోయాయి. చెరువులు, కుంటలు వట్టిపోయాయి. బోర్లు, బావుల్లో నీటి లభ్యత తగ్గిపోయింది. ఇంకో పది రోజుల్లో పంట చేతికొస్తుందన్న తరుణంలో వరి చేలు నీరు అందక ఎండిపోతున్నాయి. మూసీ ఆయకట్టులో మినహా ఏ గ్రామంలో చూసినా ఎండిన పంటలే దర్శనమిస్తున్నాయి.

30 శాతానికి పైగా ఎండిన పంటలు

జిల్లాలో యాసంగి సీజన్‌లో 2.93 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో అనధికారికంగా 30 శాతానికి పైగా వరి పంట దెబ్బతింది. ఓవైపు నీటి కొరత, మరోవైపు ఎండలు ముదరడంతో ఉన్న కొద్దిపాటి పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. నాన్ ఆయకట్టు మండలాల్లో వందల ఫీట్ల లోతు కొత్త బోర్లు వేస్తున్నారు. అయినా చుక్క నీరు పడని పరిస్థితి నెలకొంది. కొందరు రైతులు సుదూర ప్రాంతాల్లోని రైతుల బోర్లను అద్దెకు తీసుకొని కిలోమీటర్ల మేర పైపులైన్‌లు వేసి పంటలను బతికించుకుంటున్నారు. ఇంకొందరు డబ్బులు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి తడులు పెడుతున్నారు. ఆర్థిక స్థోమత లేని రైతులు ఎండు దశకు

మేతకు కొనుగోలు చేశా



నరసింహ అనే రైతు రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. నీరు లేక పొలం పూర్తిగా ఎండిపోయింది. నాకు 40 జీవాలు ఉండడంతో మేత కోసం ఎండిన వరి పంటను రూ.14వేలకు కొనుగోలు చేశాను. – గంటిల పాపయ్య, మహ్మదాబాద్, సంస్థాన్‌నారాయణపురం



ఆత్మకూరు(ఎం) మండలం కప్రాయపల్లికి చెందిన దేవరపల్లి అంజిరెడ్డి ఆరు ఎకరాల్లో వరి సాగు చేశాడు. సాగులో వరి సాగు చేస్తున్నాడు. మొన్నటి వరకు బావి నీటిని అందించాడు. భూగర్భ జలాలు అడుగంటడం, మరో వైపు ఎండలు ముదరడంతో బావి వట్టిపోయింది. ఎండుతున్న వరి పంటను కాపాడుకునేందుకు రైతు మరో రైతు దగ్గర నీళ్లు మాట్లాడుకున్నాడు. నెలరోజుల నుంచి ట్యాంకర్ ద్వారా తీసుకువస్తూ పంటకు అందిస్తున్నాడు. రోజూ 8 ట్యాంకుల నీటిని అందజేస్తూ పంటను కాపాడుకుంటున్నాడు.



ఇది సంస్థాన్‌నారాయణపురం మండలం వాచ్యాతండాకు చెందిన మెగావత్ బోడ్యా పొలం. రెండు బోర్ల కింద ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేశాడు. పది రోజుల క్రితం వరకు బాగానే పోసిన బోర్లు.. భూగర్భ జలాలు పడిపోవడంతో ఎత్తిపోస్తున్నాయి. ఆరు ఎకరాల్లో పొలం ఎండిపోగా రెండు ఎకరాలు మిగిలింది. ఇందులో ఎకరం పొలానికి బోర్ల ద్వారా నీరందిస్తున్నాడు. మిగతా ఎకరం పొలాన్ని కాపాడుకునేందుకు కిలో మీటరు దూరంలో ఉన్న పల్లగట్టుతండాకు చెందిన రైతు బోరును రూ.15వేలకు అద్దెకు తీసుకున్నాడు. అక్కడి నుంచి పైపులైన్ వేసి పంటను కాపాడుకుంటున్నాడు. 8 ఎకరాలకు రూ.1.60 లక్షల వరకు ఖర్చు వచ్చిందని, పెట్టుబడి కూడా వెళ్లడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆటలు ఆడేదెలా?

- చెట్లు, పిచ్చి మొక్కలతో నిండిన క్రీడా ప్రాంగణాలు
- మూలనపడ్డ పరికరాలు
- క్రీడలకు దూరమవుతున్న యువత



చెట్లతో నిండిపోయిన ఆలేరు మండలంలోని కొలనుపాక క్రీడా ప్రాంగణం

ఆలేరు : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. నిర్వహణ లేక చెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఆటల పరికరాలు మూలనపడ్డాయి. ఫలితంగా యువత ఆటలకు దూరం అవుతోంది. జిల్లా వ్యాప్తంగా 421 గ్రామ పంచాయతీలు ఉండగా 416 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. వీటికోసం రూ.12.21 కోట్లు మంజూరు చేసింది.

గ్రామాలకు దూరంగా ఏర్పాటు

పలు చోట్ల పాఠశాలల ఆవరణల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో సరిపడా స్థలాలు లేక గ్రామాలకు దూరంగా నిర్మించారు. పల్లెకో క్రీడా మైదానం ఉన్నా నిర్వహణ లేకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. కేవలం బోర్డులే దర్శనం ఇస్తున్నాయి. చెట్లతో నిండిపోయిన క్రీడా ప్రాంగణాలకు రావడానికి యువకులు ఆసక్తి చూపడం లేదు. వాలీబాల్, నెట్ వ్యాయమం చేసే పరికరాలు, డంబెల్స్ వంటివి మూలనపడ్డాయి.

వినియోగంలోకి తీసుకువస్తాం

తెలంగాణ క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువస్తాం. క్రీడాకారులు ఉపయోగపడేలా గ్రామ పంచాయతీ సిబ్బందితో మైదానాలను చదును చేయిస్తాం. అక్కడ క్రీడలు ఆడేవిధంగా, క్రీడా పోటీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్ని ఆటల పరికరాలను పంపిణీ చేశాం. అవి సద్వినియోగం అయ్యేలా చూస్తాం. – కృష్ణన్, డీఆర్‌డీఓ

అనుకూలంగా లేవు



గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ఆటలు ఆడేందుకు అనుకూలంగా లేవు. ప్రస్తుతం చెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. రాళ్లు తేలి ఉండడంతో ఆటలాడే పరిస్థితి లేదు. మైదానాలను చదును చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలి. దీంతో గ్రామీణ యువత ఆటల్లో రాణించే అవకాశం ఉంటుంది. – పూసలోజు కృష్ణ, కోచ్, ఆలేరు

నిర్వహణ కొరవడింది



గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు కొదవలేదు. కానీ, సరైన సౌకర్యాలు లేకపోవడంతో వారు క్రీడల్లో రాణించలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారే తప్పా.. వాటి నిర్వహణ గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. ఏ మైదానం చూసినా కంపచెట్లతో నిండి ఉంది. ఆటలకు అనువుగా లేవు. – పూల చంద్రకుమార్, క్రీడాకారుడు, ఆలేరు

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

- కలెక్టర్ హనుమంతు కే. జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి : రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతున్నందున వడదెబ్బ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే పేర్కొన్నారు. వడదెబ్బ నివారణకోసం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం అయ్యారు. వేసవిలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికలు తయారు చేసుకుని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఉపాధిహామీ పనులు జరిగే ప్రదేశాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, మధ్యాహ్నం 12గంటల వరకు మాత్రమే పనులు పూర్తి చేయాలన్నారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది వడ దెబ్బవల్ల కలిగే నష్టాలపై ప్రజలకు తెలియజేయాలని, అవసరమైన వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేయాలని సూచించారు. ప్రధాన దేవాలయాల ప్రాంగణాల్లో నీటి సౌకర్యంతో పాటు చలువ పందిళ్లు వేయాలని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ పాపారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ గంగాధర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎం.సుమన్‌కళ్యాణ్, డాక్టర్ వంశీకృష్ణ, నోడల్ ఆఫీసర్ అశ్వినికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పునరావాసం ఇంకెప్పుడు?

యాదగిరిగుట్ట రూరల్ : బస్వాపురం రిజర్వాయర్ పనులు ప్రారంభించి నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ పునరావాసం కల్పించడం లేదని యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్ తండా నిర్వాసితులు ఆవేదన వ్యక్త చేశారు. గురువారం వారు రిజర్వాయర్ వద్ద విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతుండడంతో సర్వస్వం కోల్పోతున్నామని తెలిపారు. ఇళ్లు నిర్మించుకోవడానికి దాతర్‌పల్లిలోని సర్వే నంబర్ 294లో 30 ఎకరాల స్థలంలో లేఅవుట్ చేసి 327 కుటుంబాలకు ప్లాట్‌లు కేటాయిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. నూతన సర్కార్ అయినా పట్టించుకొని త్వరగా ప్లాట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దీరావత్ బుజ్జి, శంకర్‌నాయక్, నిర్వాసితులు ఉన్నారు.

అభాగ్యురాలికి మంత్రి చేయూత

- రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేసిన కోమటిరెడ్డి
- పిల్లల భవిష్యత్తుకు భరోసా



లావణ్య, పిల్లలతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మోత్కూరు : భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న ఓ అభాగ్యురాలు తన పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. తన బాధలు చెప్పుకోవడంతో చలించిపోయిన మంత్రి.. ఆమెకు తక్షణం లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. వివరాలిలా.. మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన మామిడి లావణ్య భర్త మామిడి సత్యనారాయణ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇటీవల మరణించారు. ఆస్తులన్నీ అమ్మి భర్తకు చికిత్స చేయించినా నయం కాలేదు. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో తాళలేక తన ముగ్గురు పిల్లలు నిషిత, హర్షిత, బానితిని తీసుకొని సాయం కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు. విలపిస్తూ తన బాధలు చెప్పుకున్నారు. మంత్రి స్పందిస్తూ అధైర్యపడవద్దని, అండగా ఉంటానని, పిల్లలను తానే చదివిస్తానని లావణ్యకు భరోసా ఇచ్చారు. సీఎంఆర్‌ఎఫ్ ఉన్నతాధికారి వేముల శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి మామిడి సత్యనారాయణకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా లావణ్య కుటుంబానికి లక్ష రూపాయల లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా రావల్సిన పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

టిఫిన్ పే చర్చలో పాల్గొనాలి



మాట్లాడుతున్న చందా మహేందర్ గుప్తా

భువనగిరి : బీజేపీ ఏర్పడి 44 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పార్టీ జెండాను ఎగరవేసి టిఫిన్ పే చర్చలో పాల్గొనాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా కోరారు. గురువారం భువనగిరిలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ దేశానికి, ప్రజల కోసం చేస్తున్న పనులను ప్రజలకు వివరించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఖిలాపై కాషాయ జెండా ఎగురవేయాలని, అందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి నీలం రమేష్, జిల్లా కార్యదర్శి ఉడుత భాస్కర్,పట్టణ ప్రధాన కార్యదర్శి రత్నపురం శ్రీశైలం ,పట్టణ ఉపాధ్యక్షుడు ఎంగిలి లక్ష్మణ్, నాయకులు సంతోష్,కిసన్‌జీ, రాజుచారి, నరేష్ పాల్గొన్నారు.

ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ

- మున్సిపాలిటీల్లో ఆస్తిపన్నుదారులకు ఆఫర్
- ఈ నెల 30వరకు గడువు
- బకాయి లేనివారికే అవకాశం



ఆస్తిపన్ను వసూలుకు భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీల్లో ఆస్తిపన్నుదారులకు మున్సిపల్ శాఖ ఆఫర్ ప్రకటించింది. ఈనెల 30వ తేదీ వరకు ఒకేసారి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. గత సంవత్సరం ఎటువంటి బకాయిలు లేనివారికి రాయితీ వర్తించనుంది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ అధికారులు కోరుతున్నారు.

బకాయిలు పెరగకుండా..

మున్సిపల్ కార్యాలయాల్లో సేవలు, పారిశుద్ధ్యం, కార్మికులు వేతనాలు, బిల్లుల చెల్లింపుతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలంటే సొంతంగా ఆదాయం సమకూర్చుకోవల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రజలు చెల్లించే పన్నులు ప్రధాన ఆధారం. పన్నుల బకాయిలు పెరిగిపోకుండా మున్సిపల్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ఇస్తుంది. దీంతో గృహ , వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు ఆస్తిపన్ను చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని అధికారులు పన్ను వసూళ్లను ముమ్మరం చేశారు. భువనగిరి, ఆలేరు. మోత్కూరు, యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. పన్నులను కార్యాలయానికి వచ్చి నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లించడానికి అధికారులు అవకాశం కల్పిస్తున్నారు.

2024-25లో ఆస్తిపన్ను డిమాండ్ ఇలా..

మున్సిపాలిటీ	అసెస్‌మెంట్	డిమాండ్ (రూ.లక్షల్లో)
భువనగిరి	14,628	రూ.723.09
పోచంపల్లి	4,848	రూ.174.78
యాదగిరిగుట్ట	4,721	రూ.355.92
ఆలేరు	1,171	రూ.222.76
మోత్కూరు	4,818	రూ.98.42
చౌటుప్పల్	8,797	రూ.704.98

రాయితీ అవకాశంతో సత్ఫలితం

ఆస్తిపన్ను చెల్లించే విషయంలో చాలామంది అలసత్వం ప్రదర్శిస్తుంటారు. దీంతో ఏటా బకాయిలు పెరిగిపోతున్నాయి. ఇది అభివృద్ధి, ప్రజలకు కల్పించే సౌకర్యాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు మున్సిపల్ శాఖ నాలుగేళ్ల క్రితం ఎర్లీబర్డ్ స్కీం పేరిట సరికొత్త ఆలోచనలో ముందుకు వచ్చింది. బకాయిలు చెల్లిస్తే వడ్డీ రాయితీ, ముందస్తుగా పన్ను కడితే రిబేట్‌ను ప్రకటించింది. ఈ విధానం ద్వారా సత్ఫలితాలు కనిపించాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది సైతం ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నారు. ఇందుకోసం ఈనెల 30వ తేదీ వరకు గడువు విధించారు.

ప్రచారం కల్పించేందుకు ఏర్పాట్లు

ఆస్తిపన్నుపై మున్సిపల్ శాఖ ప్రకటించిన రాయితీపై విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్లలో బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా రోజూ ఉదయం చెత్త సేకరణకు వెళ్లే వాహనాల ద్వారా ప్రచారం చేయాలని, కరపత్రాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, బిల్ కలెక్టర్లు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి రాయితీపై అవగాహన కల్పించనున్నారు.

భువనగిరిలో గత ఏడాది కంటే తక్కువే

ఆస్తిపన్ను వసూలు చేయడంలో భువనగిరి మున్సిపల్ అధికారులు లక్ష్యం చేరలేకపోయారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను 14,628 అసెస్‌మెంట్‌లకు రూ.723.09 లక్షలు లక్ష్యం నిర్దేశించారు. మార్చి 31వ తేదీ నాటికి రూ.532.82 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. అంటే నిర్దేశిత లక్ష్యంలో రూ.190.27లక్షల మేర వెనుకబడిపోయారు. వసూళ్లను పెంచే క్రమంలో మొండి బకాయిదారుల కోసం మార్చి నెలలో 90శాతం వడ్డీ రాయితీతో వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) స్కీం కూడా తీసుకువచ్చారు. అయినా ఆశించిన ఫలితాలు రాలేదు. 2022–23 ఆర్థిక సంవత్సరం 76.55 శాతం పన్ను వసూలు కాగా ఈసారి 73.69 శాతం మాత్రమే నమోదైంది.

సద్వినియోగం చేసుకోవాలి

పన్ను బకాయిలు పెరిగిపోకుండా మున్సిపల్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముందస్తుగా పన్ను చెల్లించేవారికి 5 శాతం రాయితీని ప్రకటించింది. ఇందుకోసం ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి. – రామాంజులరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని మృతదేహం

రామగిరి (నల్లగొండ): తిప్పర్తి మండల పరిధిలోని జొన్నగడ్డలగూడెం గ్రామ శివారులో గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నగడ్డలగూడెం గ్రామ శివారులోని రైల్వే అండర్ పాస్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గడ్డిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గ్రామానికి చెందిన పశువుల కాపరులు గురువారం సాయంత్రం గుర్తించారు. అప్పటికే మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేకుండా ఉంది. అటుగా వస్తున్న పశువుల కాపర్లు దుర్వాసన వస్తుండటంతో వెళ్లి చూడగా వారికి మృతదేహం కనిపించింది. వెంటనే తిప్పర్తి పోలీసులకు సమాచారం అందించడంతో క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించినట్లు తెలిసింది. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

నల్లగొండ క్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నల్లగొండ మండలంలోని జీకే అన్నారం మాజీ సర్పంచ్ బోదనపు వెంకట్‌రెడ్డి (67) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. 10 రోజుల క్రితం ఆయన కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా.. చౌటుప్పల్ వద్ద కారు అదుపుతప్పి ముందు ఉన్న లారీని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకట్‌రెడ్డికి తీవ్రంగా గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పనిచేసిన వెంకట్‌రెడ్డి మృతి పట్ల నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పిల్లి రామరాజుయాదవ్, మారగోని గణేష్‌గౌడ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

లారీని ఢీకొట్టిన కారు.. మహిళ దుర్మరణం


లారీని ఢీకొట్టిన కారు

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై హైదరాబాద్ మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా బలిపర్వ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన బోజ స్వరాజ్యం(60), తన అల్లుడు గోవిందవరపు సురేష్ కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఆ క్రమంలో చౌటుప్పల్ పట్టణ శివారులో తహసీల్దార్ కార్యాలయం వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో స్వరాజ్యం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ప్రపంచ పటంలో ఫణిగిరి బౌద్ధక్షేత్రం

- పురావస్తుశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరెక్టర్ భారతి హోళికేరి

నాగారం: మండల పరిధిలోని ఫణిగిరి బౌద్ధ క్షేత్రంపై లభించిన ఇక్ష్వాకుల కాలం నాటి నాణేలు, బౌద్ధ శిల్పాలతో మారుమూలనున్న ఆ గ్రామం ప్రపంచ పటంలో నిలిచిందని రాష్ట్ర పురావస్తుశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, పురావస్తుశాఖ రాష్ట్ర డైరెక్టర్ భారతి హోళికేరి అన్నారు. ఫణిగిరి కొండపై జరుపుతున్న తవ్వకాల్లో బయల్పడిన సీసపు నాణేలకు సంబంధించిన వివరాలను గురువారం విలేకరులకు వెల్లడించారు. ఫణిగిరి బౌద్ధక్షేత్రంపై ఒకే కుండలో 3,730 సీసపు నాణేలు లభించాయని, ఒకే చోట ఇంత పెద్ద మొత్తంలో నాణేలు లభించడం భారతదేశ చరిత్రలో తొలిసారి అని పేర్కొన్నారు. ఈ సీసపు నాణేలపై ఒక వైపు ఏనుగు, మరొక వైపు ఉజ్జయిని గుర్తులు ఉన్నాయని, ఇవి ఇక్ష్వాకుల కాలం నాటి నాణేలుగా నిర్ధారించామన్నారు. ఫణిగిరిలో మ్యూజియం నిర్మాణానికి కలెక్టర్ తన పూర్తి


సీసపు నాణేలను పరిశీలిస్తున్న శైలజా రామయ్యర్, భారతి హోళికేరి

సహకారాన్ని అందించారని, దీని ద్వారా ఇక్కడ తవ్వకాల్లో లభించిన చారిత్రక ఆధారాలు, పురాతన ఆధారాలు పర్యాటకులు తిలకించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. బౌద్ధక్షేత్రంపై లభించిన బౌద్ధ మహాస్థూపం, ఉద్దేశిక స్థూపాలు, సభ మండపాలు, శిలా శాసనాలు, నాణేలు, వీటన్నిటికీ ఫణిగిరి గ్రామ ప్రజలే వారసులని, అందరం కలిసి ఫణిగిరిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుదామని అన్నారు. ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఫణిగిరి కొండపై ఏడుసార్లు తవ్వకాలు జరిపామన్నారు. ఇంకా రెండు చోట్ల తవ్వకాల అనుమతికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఫణిగిరిలో ఎంతో విలువైన చారిత్రక ఆధారాలు లభిస్తున్నాయని అందులో ముఖ్యమైనవి విహారాలు, గాజు, రాతి పూసలు, విరిగిన సున్నపు రాతి విగ్రహాలు ఉన్నాయని చెప్పారు. 2400 ఏళ్ల క్రితమే ఎలాంటి సాంకేతిక పరికరాలు లేని రోజుల్లోనే పెద్ద పెద్ద రాళ్లను కొండల పైకి తీసుకువచ్చి శిల్పాలుగా మలిచి బౌద్ధ చరిత్రను చాటారని అన్నారు. ఇక్కడ లభించిన బౌద్ధ స్థూపాలను కొన్ని అమెరికాలోని న్యూయార్క్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, పురావస్తుశాఖ ఉప సంచాలకుడు నారాయణ, అదనపు సంచాలకుడు మల్లు నాయక్, తహసీల్దార్ బ్రహ్మయ్య, గ్రామస్తులు పులిగిళ్ల వీరమల్లు యాదవ్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

కేతేపల్లి: అదుపుతప్పి ఆటో బోల్తా పడడంతో మహిళ మృతిచెందింది. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తళాపురం గ్రామానికి చెందిన ఆమనగంగి అశోక్ ఇటీవల కొత్త ట్రాలీ ఆటోను కొనుగోలు చేశాడు. ఈ ఆటోను హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీలో చెత్తను తరలించేందుకు లీజు ప్రాతిపదికన పెట్టి వాహనాన్ని తానే స్వయంగా నడిపిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నాడు. ఈ నెల 1వ తేదీన స్వగ్రామం ఇస్తళాపురంలో ఎల్లమ్మ పండుగ చేసేందుకు అశోక్ తన కుటుంబంతో కలసి ఆటోలో వచ్చాడు. పండుగ పూర్తయిన అనంతరం బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో కేతేపల్లి మండలంలోని ఇనుపాముల బస్ స్టేజీ సమీపంలోకి చేరుకోగానే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అశోక్ తల్లి ఆమనగంటి ఎల్లమ్మ(55), తండ్రి సత్తయ్య, ఇతర కుటుంబ సభ్యులు అనంతమ్మ, భారతమ్మ, పూలమ్మ, మల్లయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ ఆమనగంటి ఎల్లమ్మ మృతి చెందింది. బాధితుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కేతేపల్లి ఎస్ఐ శివతేజ తెలిపారు.


ప్రమాదానికి గురైన ట్రాలీ ఆటో

కుమార్తె పెళ్లికి వెళ్తుండగా ప్రమాదం

- రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు
- ముహూర్తం దాటిపోతుండడంతో తల్లిదండ్రులు లేకుండానే పెళ్లి

కొణిజర్ల: కుమార్తె పెళ్లి ఘనంగా చేయడానికి సిద్ధమైన తల్లిదండ్రులు స్వగ్రామం నుంచి కల్యాణ వేదిక వద్దకు వెళ్తుండగా మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చివరకు వధువు తల్లిదండ్రులు లేకుండానే బంధువులు కల్యాణతంతు నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెంకు చెందిన ఏదులాపురం సైదులు, మంగ దంపతుల ఏకైక కుమార్తె రమ్య వివాహం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తుమ్మలపల్లికి చెందిన బొడ్డుపల్లి నరేందర్‌తో నిశ్చయమైంది. తుమ్మలపల్లిలో గురువారం ఉదయం 9.15 గంటలకు వివాహం జరగాల్సి ఉండగా.. బుధవారం రాత్రే బంధువులతో పాటు కుమార్తెను పంపించారు. గురువారం


ఘటనా స్థలంలో పడి ఉన్న సైదులు, మంగ

ఉదయం సైదులు, మంగ ద్విచక్ర వాహనంపై తుమ్మలపల్లి వస్తుండగా గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల సమీపంలో వారి వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతులిద్దరి తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ఖమ్మం తరలించారు. వివాహ ముహూర్త సమయం దాటి పోతుండడంతో వధువు తల్లిదండ్రులు లేకుండానే వివాహ తంతు ముగించారు. కన్న కూతురు వివాహ వేడుకను వారు చూడలేకపోయారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

నార్కట్‌పల్లి: కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు.. నార్కట్‌పల్లి మండలంలోని ఏనుగులదోరి గ్రామానికి చెందిన పన్నాల శంకర్‌రెడ్డి(78) కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో, తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపునొప్పి భరించలేక ఈ నెల 2వ తేదీ రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. గురువారం మృతుడి కుమారుడు పన్నాల పాపిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

గంజాయి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట: గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు, కల్తీ కల్లు నిర్మూలించడం పట్ల ప్రజలు, యువత అవగాహన కలిగి ఉండాలని రూపొందించిన ప్రజా అవగాహన పోస్టర్ ఎస్పీతో పాటు, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు కలిసి గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో వారు రూపొందించిన ఈ పోస్టర్లను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లకు అందించామన్నారు. గంజాయి వల్ల సమాజానికి హాని ఉందని, యువశక్తి నిర్వీర్యం అవుతుందన్నారు. గంజాయి నిర్మూలన, వాటి మూలాలను తొలగించడం కోసం జిల్లా పోలీసు శాఖ పటిష్టంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ జనార్దన్‌రెడ్డి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐలు రాము, రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు తదితరులు

ముగిసిన జాతీయ స్థాయి నాటకోత్సవాలు


ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పద్య, సాంఘిక నందిని నాటకోత్సవాలు గురువారం ముగిశాయి. ఆరో రోజు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సంగనభట్ల నర్సయ్య, సీనియర్ రంగస్థల నటుడు నూకల జానకిరాములు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి వెలిగించి నాటకోత్సవాలను ప్రారంభించారు. పల్నాడు జిల్లాకు చెందిన టి.కృష్ణ థియేటర్స్ మిట్టపాలెం వారు 'ప్రేమించే వయసేన' అనే సాంఘిక నాటికను, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ వారు 'జరుగుతన్న కథ' అనే సాంఘిక నాటికను ప్రదర్శించారు. కాగా నాటకోత్సవాల ముగింపు కార్యక్రమానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరై ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు, నగదు ప్రదానం చేశారు. ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా స్వామి అయ్యప్ప నాటకం, ద్వితీయ ప్రదర్శనగా శ్రీకృష్ణ, కర్జార్జునీయం, తృతీయ ప్రదర్శనగా మైరావణ, ఉత్తమ ప్రదర్శనగా మాధవవర్మతో పాటు ఉత్తమ రంగాలంకరణగా సురభి సంతోష్, ఉత్తమ ఆహార్యంగా చింతా శ్రీనివాస్, ఉత్తమ సంగీతం విభాగంలో ఎ. శివ సుబ్రహ్మణ్యం, ఉత్తమ జ్యూరీలుగా హారిక, చాగంటి సాయిలక్ష్మీతో పాటు మరికొంతమందికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు, అధ్యక్ష, కార్యదర్శులు భుజంగరావు, పులి కృష్ణమూర్తిశర్మ, గ్యార సాయిలు, కోశాధికారి పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, కాంగ్రెస్ నాయకుడు జానకిరాం రెడ్డి, చంద్రశేఖర్‌రావు, జానకిశర్మ, ఎండీ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే భద్రాద్రి రామయ్య తలంబ్రాలు

- రూ.151 చెల్లిస్తే ఆర్టీసీ కార్గో ద్వారా అందజేత
- ఈ నెల 18వ తేదీ వరకు అవకాశం

మిర్యాలగూడ టౌన్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారామచంద్రుల కల్యాణోత్సవంలో ఉపయోగించే తలంబ్రాలను భక్తులు ఇంటికి తీసుకెళ్తుంటారు. అయితే శ్రీరామనవమి వేడుకలకు భద్రాచలం వెళ్లలేకపోయిన భక్తులకు ఇంటి వద్దకే తలంబ్రాలు అందించాలని ఆర్టీసీ నిర్ణయించింది. అందులో భాగంగా గతంలో మాదిరిగానే ఈసారి కూడా దేవదాయ ధర్మాదయా శాఖ సహకారంతో రాములోరి తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే చేర్చే కార్యక్రమానికి ఈ నెల 4వ తేదీన శ్రీకారం చుట్టింది. తలంబ్రాలు కావాలనుకునే భక్తులు ఈ నెల 18వ తేదీ వరకు టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) కేంద్రాలలో రూ.151 చెల్లించి తమ పేర్లు, వివరాలు నమోదు చేసుకుంటే కల్యాణం అనంతరం ఆర్టీసీ ద్వారా ఇంటికి తీసుకొచ్చి ఇస్తారు.



తలంబ్రాల బుకింగ్ కోసం డిపోల వారీగా సంప్రదించాల్సిన నంబర్లు

డిపో	అధికారి	ఫోన్ నంబర్
మిర్యాలగూడ	పరింగి నాగేశ్వర్‌రావు	9154298693
నల్లగొండ	సైదులు	9154288691
దేవరకొండ	హరిలాల్	9154298694
నార్కట్‌పల్లి	యాదయ్య	9154298692
సూర్యాపేట	జానీపాష	9154298695
కోదాడ	రాజశేఖర్	9154298696
యాదగిరిగుట్ట	భాస్కర్	9154298697
రీజినల్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్	శ్యాం	9154298690
అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్	సి. రవీందర్	8125451791

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట, నార్కట్‌పల్లి, దేవరకొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, నల్లగొండ ఆర్టీసీ డిపోల పరిధిలో 2022లో భద్రాచలం రాములోరి తలంబ్రాల కోసం ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) ద్వారా 11,111 మంది పేర్లు నమోదు చేసుకోగా ఆర్టీసీకి రూ.8,88,880 ఆదాయం వచ్చింది. అదేవిధంగా గతేడాది 2023లో 11,680 మంది పేర్లు నమోదు చేసుకోగా రూ.13,54,880 ఆర్టీసీకి ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా భద్రాచలం రాములవారి కల్యాణ తలంబ్రాలకు సంబంధించిన బుకింగ్ ప్రారంభమైంది. భక్తులు ఆయా డిపోల పరిధిలోని లాజిస్టిక్(కార్గో) కేంద్రాల ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా కూడా డబ్బులను చెల్లించి పేర్లు నమోదు చేసుకొని రశీదు పొందవచ్చు. కల్యాణం అనంతరం ఇంటి వద్దకు ఆర్టీసీ సిబ్బంది వచ్చి రాములవారి తలంబ్రాలు అందిస్తారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నల్లగొండ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

నార్కట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండకు చెందిన తండు మహేష్ (35) బుధవారం సాయంత్రం నల్లగొండ నుంచి రామన్నపేటకు బైక్‌పై వెళ్తుండగా.. నార్కట్‌పల్లి సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

చౌటుప్పల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. వివరాలు.. వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన కందాటి మోహన్‌రెడ్డి(71) కుటుంబ సభ్యులతో కలిసి రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో నివాసముంటున్నాడు. సొంతూరిలో వ్యవసాయం చేస్తుంటాడు. ఇటీవల వరి పంట కోసి పొలం వద్దనే ధాన్యాన్ని ఆరబోశారు. గురువారం ద్విచక్ర వాహనంపై సొంతూరుకు వెళ్తుండగా.. మార్గమధ్యలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామం వద్ద బ్రిడ్జి దాటాక వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మోహన్‌రెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు సురేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొని..

నేరేడుచర్ల: ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం నేరేడుచర్ల మండలం సోమారం గ్రామ శివారులో జరిగింది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామం నుంచి ధాన్యం లోడుతో ట్రాక్టర్ మిర్యాలగూడ వైపు వెళ్తుండగా.. అదే సమయంలో గరిడేపల్లి మండలం ముత్యాలమ్మగూడేనికి చెందిన మిగిడి జానయ్య(48) బైక్‌పై నేరేడుచర్ల మండలం సోమారం గ్రామం నుంచి కల్లూరు వైపు వెళ్తున్నాడు. ట్రాక్టర్, బైక్ సోమారం గ్రామ శివారులో ఎదురెదురుగా ఢీకొనడంతో జానయ్య కిందపడడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. జానయ్యను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గూడూరు టోల్‌ప్లాజాకు 'శుభకార్యాల' ఎఫెక్ట్

- బారులుదీరిన వాహనాలు


టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు

బీబీనగర్: మండల పరిధిలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం శుభకార్యాల ఎఫెక్ట్ కనిపించింది. గురువారం అధికంగా వివాహాలు, శుభకార్యాలు ఉండటంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి గూడూరు టోల్‌ప్లాజా మీదుగా ప్రయాణికులు రాకపోకలు సాగించడంతో వాహనాల రద్దీ పెరిగింది. ముఖ్యంగా ఉదయం నుంచి మధ్యాహ్నం, సాయంత్రం నుంచి రాత్రి వరకు వాహనాల రద్దీ నెలకొంది. దీంతో టోల్‌ప్లాజాకు రెండు వైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఫాస్టాగ్ స్కానింగ్ కూడా ఆలస్యం కావడంతో టోల్‌ప్లాజాకు ఇరువైపులా వాహనాలు కిలోమీటర్ మేర బారులుదీరాయి.

సూర్యాపేటలో రోడ్డు ప్రమాదం


సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటరావు


రుక్కమ్మ మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు


లునావత్ రుక్కమ్మ మృతదేహం


చింతరెడ్డి సరితారెడ్డి మృతదేహం


వేదాశ్విని మృతదేహం

బైక్ పైనుంచి పడి యువకుడు మృతి

హుజూర్‌నగర్: మండల పరిధిలోని అమరవరం శివారులో దొంగలదుబ్బ ప్రాంతంలో మూలమలుపు వద్ద బైక్ పైనుంచి పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం హనుమంతులగూడెం గ్రామానికి చెందిన తుపాకుల లక్ష్మీనారాయణ(30) మద్యం సేవించి బైక్‌పై హుజూర్‌నగర్ వస్తుండగా.. అమరవరం గ్రామ శివారులోని దొంగలదుబ్బ ప్రాంతంలో మూలమలుపు వద్ద పొలాల్లో పడిపోయి మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ చరమందరాజు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా హాస్పిటల్ తరలించారు. కాగా ఈ ఘటనపై తమకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని మైహోం సిమెంట్ పరిశ్రమ నందు గల శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అష్టోత్తర శతఘటాభిషేకం కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పీఠంపై అధిష్ఠింపజేశారు. స్వామి, అమ్మవార్లకు ఎదురుగా 108 కలశాలను ఒక క్రమ పద్ధతిలో ఏర్పాటు చేశారు. వాటికి ఎదురుగా ప్రధాన కలశంలో శుద్ధమైన గంగాజలానికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాలకు ఆలయ అర్చకులు మంత్రించిన నీటితో అభిషేకం నిర్వహించారు. దీంతో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న ఆలయ బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు పరిశ్రమ అధికారులు తెలిపారు. అదేవిధంగా భక్తులచే నిర్వహించిన గాత్ర కచేరి ఆకట్టుకుంది. వారం రోజులుగా పూజలు నిర్వహించిన వేద పండితులను సత్కరించారు. కార్యక్రమంలో మైహోం సిమెంట్ పరిశ్రమ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతులు, మునగాల రామ్మోహన్‌రావు దంపతులు, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, పరిశ్రమ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.